ప్రజాశక్తి
సోమవారం 20, మార్చి 2023
5
శ్రీ సత్యసాయి

600 మైలురాయిని దాటిన పాదయాత్ర

కదిరి టౌన్ : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 47వ రోజు నల్లచెరువు మండలం చిన్నపాల్లోల్లపల్లి నుండి ప్రారంభమై జోగన్నపేట వరకు 11. 2 కిలోమీటర్లు సాగింది. పాదయాత్ర చిన్న ఎల్లంపల్లి వద్దకు రాగానే 600 కిలోమీటర్లు మైలురాయిని దాటుకుంది. దీంతో పాదయాత్ర 600 కిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా నారా లోకేష్ మైలురాయిని ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

మైలురాయిని ఆవిష్కరిస్తున్న లోకేష్

టిడిపిలో నూతనోత్సాహం..

పట్టభద్రుల గెలుపుతో ఉత్తేజం వైసిపిలో అంతర్మథనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం పార్టీలో నూతనోత్తేజాన్ని నింపాయి. 2019 సార్వత్రిక ఎన్నికల నుంచి వరుసగా పరాజయాలనే చవిచూస్తూ వచ్చిన టిడిపి ఈ ఎన్నికలు ఒక ఔషధంగా పనిచేయనున్నాయి. గతంలో ఎన్నడూలేనంతగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఓటమిని చవిచూసింది. హేమాహేమీలనుకున్న వారుకూడా ఓటమి చెందారు. ఎప్పుడూ టిడిపికి కంచుకోటగా ఉండే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇంత ఘోర ఓటమిని గతంలో ఎన్నడూ చవిచూడలేదు. 14 అసెంబ్లీ స్థానాలుంటే 12 వాటిల్లో ఓటమి చెందింది. ఉరవకొండ, హిందూపురం అసెంబ్లీ స్థానాలు మినహా తక్కిన అన్ని చోట్లా ఓడిపోయింది. ఓటమే ఎరుగని కుటుంబంగానున్న జెసి కుటుంబం కూడా ఈ ఎన్నికల్లో ఓడిపోయింది. అటు తరువాత జరిగిన పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలు అన్నింటిలోనూ ఘోరంగా ఓడిపోయింది. జిల్లాలో తాడిపత్రి మున్సిపాలిటీ మినహా తక్కిన అన్ని మున్సిపాలిటీల్లోనూ వైసిపినే గెలుచుకుంది. జిల్లా పరిషత్‌లో ఒకే ఒక్క సభ్యుడి మాత్రమే అడుగు పెట్టగలిగాడు. ఇంత తక్కువ సంఖ్య జిల్లా పరిషత్‌లో ఉన్నది ఇదే ప్రథమం. ఇంతటి ఘోర ఓటములతో ఆ పార్టీ క్యాడర్‌లోనూ ఆత్మవిశ్వాసం సన్నగిల్లిందనే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది రాబోయే సార్వత్రిక ఎన్నికలను ఏ రకంగా ఎదుర్కొనగలదన్న సందేహాలు లేకపోలేదు. వచ్చే ఎన్నికల్లో ఏ మేరకు విజయం సాధిస్తారన్న అనుమానాలు ఆ పార్టీ దిగువ స్థాయి నేతల్లోనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరిగిన మండలి ఎన్నికల్లోనూ ప్రారంభంలో అంతటి ఉత్సాహం కనిపించలేదు. వైసిపిని తట్టుకుని ముందుకు పోవడం సాధ్యమా అన్న సందేహాలను ఆ పార్టీ ముఖ్య నాయకుల్లోనూ కనిపించింది. అయితే బరిలో నిలిచి కొంత వరకైనా సత్తా చాటితే చాలన్నట్టుగా ప్రారంభమైంది. అయితే ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తరువాత వస్తున్న ఓట్లు చూసి ఆ పార్టీ నాయకుల్లో నూతనోత్సహం మొదలైంది. కౌంటింగు ముందుకు సాగుతున్న కొద్దీ, విజయవకాశాలు మెరుగుపడుతున్న కొద్దీ నాయకులు మరింత ఉత్సహంగా కౌంటింగు కేంద్రం వద్దకు చేరుకోవడం ప్రారంభించారు. చాలా కాలం తరువాత ఎన్నికల ద్వారా వస్తున్న ఫలితాలు చూసి రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఇదే ట్రెండు కొనసాగే సూచనలున్నాయన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర జిల్లాలో ప్రారంభమవడంతో ఈ ఉత్సహం మరింత పెరిగినట్టు కనిపిస్తోంది. ఇది ఇలాగుంటే వైసిపిలో ఇప్పటి వరకు ఎదురులేదన్నట్టుగా ఉంటూ వచ్చిన నాయకుల్లో ఫలితాలు అంతర్మథనం మొదలైంది. ఎన్నికల కౌంటింగులో అధికారులు టిడిపి అనుకూలంగా వ్యవహరించారంటూ ఆరోపణలు చేస్తున్నారు. ఇవి చేస్తున్నప్పటికీ లోలోన మాత్రం ఎక్కడో తేడా వస్తోందన్న సందేహాలు, గుబులు మాత్రం నేతల్లో మొదలైంది. వాస్తవానికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై ప్రచార సమయంలోనే వైసిపి ముఖ్య నాయకులకు ఈ అంశం బోధపడింది. అయితే తమకున్న అధికార బలంతో ఏదో రకంగా గట్టెక్కవచ్చునని భావించారు. అందుకు అనుగుణంగా ధన బలాన్ని కూడా ఉపయోగించారు. ఇతర అభ్యర్థులెవరూ డబ్బులు పంపిణీ కూడా చేయకపోవడంతో ఇక తమ విజయం సులువు అవుతుందని భావించారు. పట్టభద్రులకు ఓటుకు వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీ చేశారు. ఈ డబ్బు ప్రభావంతో విజయం సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. కానీ ఫలితాలు చూశాక వారికీ అసలు వాస్తవం బోధపడుతోంది. డబ్బు ప్రబావం ఎన్నికల్లో ఏ మాత్రం పనిచేయలేదని, ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా ప్రజల్లో ఉందన్నది స్పష్టమవుతోంది. అయితే సంక్షేమ పథకాలు ఇంత పెద్దఎత్తున అమలు చేస్తున్నా, ప్రజల్లో ఎందుకు అసంతృప్తి ఉందన్నది మాత్రం గ్రహించలేకపోతున్నారు. ఈ ఫలితాలు ఏ రకంగా అర్థం చేసుకోవాలో పాలుపోని పరిస్థితుల్లో వైసిపి నేతలున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయంతో గుంతకల్లులో సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

విద్యాదీవెన కింద జిల్లాలో 36,391 మంది విద్యార్థులకు లబ్ధి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల కింద 36,391 మంది విద్యార్థులు లబ్ధి పొందారనికలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్టీఆర్ జిల్లాలో బటన్ నొక్కి విద్యాదీవెన నిధులు విడుదల చేసిన దృశ్యాన్ని కలెక్టరేట్ లో కలెక్టర్ తో పాటు సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 32,909 మంది తల్లుల ఖాతాలోకి రూ. 22. 85 కోట్ల పైచిలుకు మొత్తాన్ని ముఖ్యమంత్రి జమ చేశారన్నారు. పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసన్ తదితర కోర్సుల విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదువుకోవాలన్న లక్ష్యంతో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారన్నారు. ఇందులో 4912 మంది ఎస్సీ విద్యార్థులు, 2044 మంది ఎస్టి విద్యార్థులు, 19,356 మంది బీసీలు, 3785 మంది ఈ బీసీలు, 3431 మంది మైనార్టీలు, 2836 మంది కాపు విద్యార్థులు, క్రిస్టియన్ విద్యార్థులు 27 మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. అనంతరం మెగా నమూనా చెక్కును కలెక్టర్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, బీసీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహనరావు, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు : సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చలో అసెంబ్లీకి పిలుపునిస్తే అంగ్‌వాడీలను వెళ్లకుండా పోలీసులు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేస్తున్నారని అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ అన్నారు. సోమవారం చలో అసెంబ్లీ చేపట్టిన అంగన్వాడీలను వెళ్లనీయకుండా పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. ఉదయం నుంచి ప్రాజెక్టు అధ్యక్షురాలు చిలమత్తూరు శోభమ్మ, సెక్టర్ లీడర్లు దేవరపల్లి భారతీ, మణేసముద్రం పద్మవతితో పాటు అంగన్‌వాడీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి వారిని ఇంట్లో నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరితే గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లు, మెయిన్ సెంటర్లుగా మార్చాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎంతమందిని గృహనిర్బంధం చేసినా సోమవారం విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో ధర్నా జరిగి తీరుతుందని ఈ ధర్నాలో అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పెనుకొండ : అరెస్ట్ లతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి పోలీసులు నాయకులను, అంగన్వాడీలను అరెస్టు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. అంగనవాడీల సమస్యలు పరిష్కరించేదాకా ఉద్యమాలు కొనసాగిస్తామనిహెచ్చరించారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు భావమ్మ, మండల నాయకురాలు మాబున్నీసా తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో పక్క రాష్ట్రాలకు వెళ్తున్న పరిశ్రమలు

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

'యువగళం'లో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-నల్లచెరువు

జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కొత్త పరిశ్రమలని ఏర్పాటు చేయడం మాట అటుంచి ఉన్న పరిశ్రమలను వేరే రాష్ట్రాలకు తరుముతున్నాడని, కమీషన్ల కోసం వేధిస్తున్నాడని నారా లోకోష్ దుయ్యబట్టాడు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 47వ రోజు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు మండలం మీదుగా సాగింది. ఆదివారం నల్లచెరువు మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీ చిన్నపల్లోల్లపల్లి విడిదికేంద్రం నుండి ఆయన పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున లోకేష్‌కు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే, కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బికె.పార్థసారథి, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి తదితరులు ఘనస్వాగతం పలికారు. లోకేష్ పాదయాత్ర చేస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రజలను పలకరిస్తూ, మాట్లాడుతూ ముందుకు నడిచారు. దేవిరెడ్డిపల్లిలో స్థానిక సర్పంచి హర్షవర్ధన్ నాయుడు లోకేష్‌కు గజమాలతో స్వాగతం పలికారు. తదుపరి పెద్దయల్లం పల్లి వద్ద మహిళలు పురుషులు, పిల్లలు జాతీయ రహదారిపై లోకేష్‌కు మంగళహారతి ఇచ్చి బాణాసంచా కాల్చి ఆహ్వానం పలికారు. సంజీవిపల్లి వద్ద ఆయన స్థానికులతో మాటామంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. రాట్నాలపల్లి వద్దకు చేరుకున్న లోకేష్‌కు కురుబ కులస్తులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. చిన్న ఎల్లంపల్లి వద్ద పాదయాత్ర 600 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం జోగన్నపేట వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కొత్త పరిశ్రమలని ఏర్పాటు చేయడం మాట అటుంచి ఉన్న పరిశ్రమలను వేరే రాష్ట్రాలకు తరుముతున్నాడని, కమీషన్ల కోసం వేధిస్తున్నాడని దుయ్యబట్టాడు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 90 శాతం హంద్రీనీవా పనులు పూర్తి చేశామని మిగిలిన 10 శాతం పనులు పూర్తిచేసి సాగునీరు అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఎకరానికి సాగునీటిని అందిస్తామని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగం కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. శాసనసభలో ఎమ్మెల్యేలు ఓ మహిళ అని చూడకుండా తన తల్లిని తిట్టారన్నారు. తాను ఏనాడూ మహిళలను కించపరిచేలా మాట్లాడలేదన్నారు. వారి విమర్శలకు తన తల్లి నెల రోజులు బాధపడిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వారికి తగిన బుద్ధి చెబుతానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్థానిక ఎమ్మెల్యేపై ఘాటు విమర్శలు..

కదిరి ఎమ్మెల్యే పివి.సిద్ధారెడ్డిపై లోకేష్ ఘాటు విమర్శలు చేశారు. కదిరిలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తానని, బైపాస్ రోడ్డు తెస్తానని, హామీలు ఇచ్చి వాటిని గాలికి వదిలేశాడన్నారు. లక్ష్మీనరసింహస్వామి కోనేరు అభివృద్ధి పేరుతో నిధులు మింగాడని విమర్శించారు. నియోజక వర్గంలో రూ.50 వేలు పైబడి ఏ కాంట్రాక్టు అయినా తన బంధువులకు ఇప్పించుకుంటాడని ఆరోపించారు. ప్రభుత్వానికి సంబంధించిన అసైన్డ్ భూములను ఆక్రమించుకుంటాడని తెలిపారు. ఎన్‌పి.కుంటలో వెలసిన సోలార్ ప్రాజెక్టు 9 ఏజెన్సీల నుండి దాదాపు రూ.8 కోట్లు వసూలు చేశాడని అన్నారు. గ్రామాల్లో రోడ్లు వేయరు కానీ స్థానిక ఎమ్మెల్యే తన అపార్టుమెంటుకు మాత్రం రూ.50 లక్షలతో రోడ్లు మాత్రం వేసుకున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు, టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, గాలివేటి కృష్ణమోహన్ నాయుడు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలతో ప్రమాదాల నివారణ

కరుణాసాగర్ రెడ్డి, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్, శ్రీ సత్యసాయి జిల్లా

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ కరుణసాగర్ రెడ్డి తెలిపారు. రహదారి నియమ నిబంధనలు పాటించకపోవడంతో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురై ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం కూడా జరుగుతోందన్నారు. నిత్యం ఏదో ఒక చోట వాహన ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, అజాగ్రత్తే దీనికి కారణంవాహన డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, యువత అతివేగంతో జాగ్రత్తలు పాటించకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ కరుణసాగర్ రెడ్డి ఆదివారం ప్రజాశక్తి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

ప్రశ్న : మీ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను వివరిస్తారా ?

జవాబు : వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సులు మంజూరు చేయడం, వాహనాల తనిఖీ, వాహనాల ఫిట్‌నెస్, పన్నులు వసూలు చేయడం ముఖ్యమైన అంశాలన్నారు. తమ సిబ్బంది తరచూ వాహనాలను తనిఖీలు చేయడం జరుగుతుంది. రిజిస్ట్రేషన్ లేకున్నా, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా అపరాధ రుసుము వసూలు చేస్తాం. అన్ని సవ్యంగా ఉంటే ఎలాంటి సమస్య ఉండదు.

ప్రశ్న : కొన్ని హెవీ వాహనాల్లో ముఖ్యంగా లారీలలో సిమెంటు రాయి అక్రమంగా కూడా తరలిస్తుంటారు? వాటిపై చర్యలు ఏమిటి?

జవాబు : ఆ వాహనాలకు లైసెన్సులు ఉంటే సమస్య ఉండదు. కొన్ని వాహనాలు అక్రమంగా అడ్డదారుల్లో దొంగచాటుగా రవాణా చేస్తుంటారు. అలాంటి వాహనాలకు అపరాధ రుసుము విధిస్తాం. ఆ వాహనాల ఫిట్‌నెస్ పాటించకుండా ఉంటే కూడా అపరాధ రుసుము వసూలు చేస్తాం. కొందరు ఇవేవీ లేకుండా దొంగగా ఏ అర్ధరాత్రి పూటో లేక దొంగ దారుల్లో ఇతర రాష్ట్రాలకు సరుకు తరలిస్తూ ఉంటారు. వాటి పట్ల కూడా అప్రమత్తంగా ఉంటూ తమ సిబ్బంది ఆ వాహనాలను పట్టుకుంటూ ఉంటారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఉంటాం.

ప్రశ్న : జీవనోపాధి కోసం కార్మికులు నడుపుకుంటున్న ఆటోలపై మీ శాఖతోపాటు పోలీసు వారు దాడులు చేస్తూ అపరాధ రుసుము వేస్తున్నారన్న అభియోగం ఉంది ? మీరేమంటారు?

జవాబు : ఎవరి మీదా మాకు కక్ష లేదు. వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వాటి జోలికి పోము. అంతేగాక పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తుంటారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందుకే ఈ అంశాలపైనే ప్రధానంగా మా శాఖ గానీ, పోలీసులు గానీ చెకప్ చేస్తుంటారు. డీజిలు ఆటోలో అయితే ఐదుగురు, చిన్న ఆటో అయితే ముగ్గురు లేదా నలుగురు ప్రయాణికులను తీసుకెళ్లవచ్చు అంతకుమించి తీసుకెళ్తే కేసులు, అపరాధ రుసుము విధిస్తాం. అన్నీ కరెక్టుగా ఉంటే ఏ సమస్యా ఉండదు.

ప్రశ్న : రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా, లైసెన్స్ పొందాలన్నా బ్రోకర్ల హవా జరుగుతోందని అంటారు. మీరేమంటారు?

జవాబు : ఆ విధానమే ఇప్పుడు లేదు. అంతా మీ సేవలో సచివాలయాల్లోనే పనులు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ సిస్టం వచ్చిన తరువాత బ్రోకర్ల మాటే ఉండదు. వాహనాల రిజిస్ట్రేషన్ వాహన విక్రయ డీలర్ల వద్దే జరిగిపోతుంది. కాబట్టి బ్రోకర్లు మాటే ఉండదు. హిందూపురంలోని మా కార్యాలయంలో మరో రెండు నెలల లోపు ప్రతిదీ ఆన్‌లైన్ సిస్టం లోకి తెస్తున్నాం. ఏ విషయానికైనా ప్రజలు నేరుగా మా శాఖ అధికారులను కలవచ్చు.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జవాబు : సిబ్బంది కొరత లేదు. నలుగురు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ పొందే వారు నేరుగా తమను సంప్రదించవచ్చు. అతివేగం ప్రమాదకరం. ట్రాఫిక్ నిబంధనలను వాహన చోధకులు తప్పనిసరిగా పాటించాలి. అప్పుడే క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

ఉద్యమాలతోనే విద్యారంగ సమస్యలు పరిష్కారం : యుటిఎఫ్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గేయానంద్

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి -పెనుకొండ

ఉద్యమాలతోనే విద్యారంగసమస్యలకు పరిష్కారం లభిస్తుందనియు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, ` జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. యుటిఎఫ్‌జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రవీంద్ర భారతి స్కూల్ ఆవరణంలో జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు జయచంద్రా రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్రీయ దృక్పథంతో పాటు ప్రజా జీవనం, లౌకిక దష్టి, ప్రజా ప్రయోజనాల దష్ట్యా ఉద్యమాల ద్వారా ప్రజా చైతన్యం తీసుకొని వచ్చి ప్రజా సంక్షేమంలో భాగస్వామ్యం కావాలన్నారు. 3,4,5 తరగతుల విలీనం వలన విద్యారంగం సంక్షోభంలో పడిందన్నారు. ప్రభుత్వం విద్యా రంగం పట్ల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఉపాధ్యాయులను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికను నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప ఎన్నికల అధికారిగా వ్యవహారించారు. జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఎస్.జయచంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె . నాగేంద్ర, గౌరవాధ్యక్షులు కె. బూతన్న, సహాధ్యక్షులుగా జి హెచ్ బాబు, పిఎన్. సీతాలక్ష్మి, కోశాధికారిగా ఎం.సుధాకర్, జిల్లా కార్యదర్శులుగా సి.తహీర్ వలి, నారాయణ స్వామి, రమీజాబి, డి శ్రీనివాసులు, సి హరికృష్ణ, కె. చంద్ర శేఖర నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్లుగా మారుతీ శ్రీనివాసులు,జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి .రామకృష్ణ, సిపిఎస్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా నరేష్, మునిసిపల్ కమిటీ కన్వీనర్ గా రామాంజినేయులు,మహిళా కమిటీ కన్వీనర్‌గా సీతాలక్ష్మి, స్టడీ సర్కిల్ కన్వీనర్‌గా మారుతీ శ్రీనివాసులు,.ఐక్య ఉపాధ్యాయ పత్రికా కమిటీ కన్వీనర్ గా ఎం.సుధాకర్‌ను ఎన్నుకున్నారు. అదే విధంగా అకాడమిక్ కమిటీ కన్వీనర్‌గా కె . శివ శంకర్, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా మహంతేశ్వర, ఆడిట్ సభ్యులుగా ఎం. ఆంజనేయులు, ఎన్.జయంద్ర, ఆర్ రామకృష్ణ నాయక్, ఎం . ఆదినారాయణ, టి. మల్లిఖార్జున, జి.రవీంద్ర తదితరులను ఎన్నుకున్నారు.

జిల్లా కమిటీలో 'పురం' వాసులకు ప్రాధాన్యత

హిందూపురం: పెనుకొండ పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాల ఆవరణంలో ఆదివారం జరిగిన యూటిఎఫ్ జిల్లా ఎన్నికల్లో హిందూపురం ప్రాంతానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మారుతీ శ్రీనివాస్ తెలిపారు. తనతో పాటు జిల్లా సహాధ్యక్షులుగా జిహెచ్ బాబు, పిఎన్ సీతాలక్ష్మి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం రామకృష్ణను ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన నాయకులు మాట్లాడుతు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటాం చేస్తామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ధర్మవరం టౌన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని యుటిఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుకొండలోని రవీంద్రభారతి పాఠశాలలో ఆదివారం జరిగిన ప్రథమ జిల్లా కౌన్సిల్ సమావేశంలో తనను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నారన్నారు. జయచంద్రారెడ్డి ఎంపిక పట్ల ధర్మవరం జోన్ నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, హరికృష్ణ, బిల్లేరామాంజినేయులు, రాంప్రసాద్, గోపాల్‌రెడ్డి, మల్లేశ్, వినయ్‌కుమార్, ఆదిరెడ్డి, అమరనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, అమర్నాథెడ్డి, వేణుగోపాల్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అకాల వర్షాలు.. అపార నష్టం..

ప్రజాశక్తి - గాండ్లపెంట

నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికితోడు శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి రైతులకు అపార నష్టం వాటిల్లింది. వడగండ్ల వర్షానికి మండల పరిధిలోని సోమయాజులపల్లి, వేపలకుంట, ఎర్రజేనుపల్లి, బోలు గుట్లవారిపల్లి, వంకపల్లి, మడుగు వారి గొంది, తూ పల్లి తదితర గ్రామాలలో బొప్పాయి, బూడిది గుమ్మడి, మామిడి, టమోటా, చామంతి, తదితర పంటలకు తీవ్ర నష్టం జరిగింది. వేపల కుంట చెందిన కేశవరెడ్డి తన సొంత పదెకరాల పొలంలో బూడిది గుమ్మడి, మరో పది ఎకరాలు కౌలుకి తీసుకొని బొప్పాయి పంట సాగు చేశాడు. దాదాపు 24 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పంట సాగు చేశాడు. శుక్రవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి తీవ్ర నష్టం వాటిలిందని బాధితరైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే దాదాపు 15 మంది రైతులు చామంతి, మామిడి, టమోటా తదితర పంటలు సాగు చేశారు. శుక్రవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి ఈ పంటలకు తీవ్ర నష్టం కలిగింది. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

కొత్తచెరువు : మండల పరిధిలోని పోతుల కుంట కొండప్ప గాని పల్లి తలమర్ల మీర్జాపురం కేసాపురం మైల్ సముద్రం గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురుగాలులు, వడగండ్ల వానతో రైతులు సాగు చేసిన పంటలు నేలకు ఒరిగాయి. మండల వ్యాప్తంగా 120 ఎకరాల్లో మామిడి, 150 ఎకరాల్లో మొక్కజొన్న 12 ఎకరాలు, టమోటా పది ఎకరాలు, 15 ఎకరాలు దోస, కలింగర 15 ఎకరాలో సాగు చేశారు. ఇవి కూడా శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నేలకొరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పెనుకొండ : అకాల వర్షానికి మండలంలో నష్టపోయిన పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ ఆదివారం పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో పరిధిలో 131 మంది రైతులకు సంబంధించి 289 ఎకరాలలో మొక్కజొన్న పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించి పై అధికారులకు నివేదిక పంపినట్లు ఆయన చెప్పారు. ఆయా సంబంధిత రైతుభరోసా కేంద్రాల సిబ్బంది పంట నష్టపోయిన రైతుల పొలాలను సందర్శించి పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించారు. పంట నష్టపోయిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి అశోక్ కుమార్, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది శ్రీకాంత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొత్తచెరువు మండలంలో నేలకొరిగిన అరటి

గాండ్లపెంట మండలంలో నేలపాలైన బూడిగ గుమ్మడి

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పంటనష్టాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బుక్కపట్నం : అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వము తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు మండలంలో దెబ్బతిన్న మామిడి, మొక్కజొన్న, వరి పంటలను ఆయన స్థానిక సిపిఎం నాయకులతో కలసి ఆదివారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంతియాజ్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల మామిడి, మొక్కజొన్న, వరి పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు.కౌలు రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎకరాకు 20వేల ఆర్థిక సహాయం ప్రకటించి రైతు రక్షక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ తక్షణమే స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అదేవిధంగా ఎన్ హెచ్ 342 రోడ్డు విస్తరణ పనులతో రైతులు తమ మామిడి చెట్లను కోల్పోతున్నారని ప్రభుత్వం ఎవరిని సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయాలతో రైతులను ఇబ్బంది కలిగిస్తోందని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరహారం అందించాలన్నారు. గ్రామసభలు నిర్వహించి రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు పునరావాసం కల్పించాలన్నారు. ప్రతి కుటుంబానికి 15 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ , ఉపాధి హామీ కూలీల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి , సిఐటియు నాయకులు గంగాధర్, గౌస్‌లాజం తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : అకాల వర్షాలకు మండలంలోని దుద్దేబండ, వోటువారిపల్లి, మునుమడుగు రైతులు నష్టపోయిన పంట పొలాలను ఎపి రైతు సంఘం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ ఒక దుద్దేబండ పొలంలోనే సుమారు 20 మంది రైతుల 50 ఎకరాల పొలాల్లో మొక్కజొన్న , వరి, వేరుశనగ తదితర పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, రైతులు నారాయణస్వామి, అంజనేయులు, చంద్రప్ప, శంకరప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

'పురం'లో కిడ్నాప్ కలకలం

హిందూపురం : హిందూపురం పట్టణంలో నివాసం ఉంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి శివలింగప్ప కిడ్నాప్ కలకలం రేపింది. శుక్రవారం రాత్రి హిందూపురం పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి శివలింగప్పను సడ్లపల్లిలో నివాసం ఉంటున్న సడ్లపల్లి బాబురెడ్డి కర్నాటకలోని బైచాపురం వద్ద భూమిని చూపిస్తామని చెప్పి తీసుకెళ్లాడు. రాష్ట్ర సరిహద్దులోని ఒక తోటలో శివలింగప్పను బంధించారు. అయితే శివలింగప్ప కిడ్నాపర్ల నుంచి తప్పించుకొని శనివారం రాత్రి హిందూపురం చేరుకున్నాడు. దీంతో కిడ్నాప్ ఘటన వెలుగు చూసింది. ఈ విషయంపై బాధితుడు శివలింగప్ప మాట్లాడుతు భూమిని చూపిస్తామనిబాబు రెడ్డితోపాటు మరో ఇద్దరు తనను తీసుకెళ్లి బైచాపురం వద్ద ఓ గెస్ట్ హౌస్ లో బంధించారన్నాడు. ఈసందర్భంగా వారు తనను గన్‌తో బెదిరించి డబ్బులకు డిమాండ్ చేశారని చెప్పాడు. అంతటితో ఆగకుండా ఇంటికి ఫోన్ చేసి తన భార్యను డబ్బులు డిమాండ్ చేశారన్నారు. అయితే తన భార్య వీడియో కాల్ చేసి తనకు చూపించాలని చెప్పిందన్నారు. దీంతో వెంటనే కాల్ కట్ చేసి, తనకు వేరే చోటికి మార్చారన్నారు. అయితే వారి నుంచి చాకచక్యంగా తప్పించుకుని ఇంటికి వచ్చానన్నారు. అయితే అప్పటికే తన భార్య ప్రమీలమ్మ హిందూపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. తనకు కిడ్నాప్ చేసిన వారు అధికార పార్టీకి చెందిన వారు అని తెలిపారు. ఇది ఇలా ఉండగా నిందితుడు బాబురెడ్డిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నప్పటికి మీడియాకు వివరాలను వెల్లడించలేదు. దీనికి ప్రదాన కారణం నిందితుడు అధికార పార్టీ తరపున గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డు కౌన్సిలర్‌గా తన భార్యకు టికెట్ ఇప్పించుకుని పోటీ చేశారు.

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు : పట్టణంలో కలకలం రేపిన కిడ్నాప్ కేసును పోలీసులు సకాలంలో చేదించినప్పటికి వివరాలను వెల్లడించడంలో మీనామేషాలు లెక్కించారు. చివరకు ఆదివారం రాత్రి అరెస్టుకు సంబంధించి ప్రెస్‌నోట్‌ను వన్‌టౌన్ సిఐ ఈరన్న విడుదల చేశారు. అందులో హిందూపురం పట్టణం సడ్లపల్లికి చెందిన వెంకటేష్ బాబు అలియాస్ బాబురెడ్డి అతని అనుచరులతో కలిసి శివలింగప్పను కిడ్నాప్ చేసిన విషయంపై శివలింగప్ప భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని చెప్పారు. బాబురెడ్డిని ఆదివారం పట్టణంలోని లేపాక్షి రోడ్డులో సాయి బాబా ఆలయం ఆర్చి వద్ద అరెస్టు చేశామని వివరించారు. నిందితుడి నుంచి ద్విచక్ర వాహనంతో పాటు బొమ్మ తుపాకీ, ప్రామిసరి నోట్లు, డాక్యుమెంట్స్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పాముకాటుతో బాలిక మృతి

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రిలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న పూజిత (12) మృతిచెందింది. ధర్మవరం మండలం రావులచెరువు గ్రామానికి చెందిన శివయ్య, లక్ష్మిదేవి దంపతుల రెండవ కుమార్తె పూజిత బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామానికి చెందిన తన అమ్మమ్మ వారి ఇంటిలో ఉంటూ ఓ ప్రయివేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. శనివారం రాత్రి ఇంటి వద్ద అడుకుంటుండగా పాము కరిచింది. దీంతో కుటుంబసభ్యులు గ్రామంలోనే నాటువైద్యం చేయించారు. దీంతో రాత్రి రెండు గంటల సమయంలో పరిస్థితి విషమం కావడంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఘనంగా మల్లు స్వరాజ్యం వర్ధంతి

కదిరి టౌన్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం, కేరళ మాజీ ముఖ్యమంత్రి ఇఎంఎస్ నంబూద్రి పాల్ వర్ధంతిని వేడుకలు శనివారం కదిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు శాంతిబాయి, అమరావతి, పూజిత, హేమావతి, సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు, జగన్మోహన్, బాబ్జాన్, ముస్తాక్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ మల్లు స్వరాజ్యం చేసిన పోరాటాలను గుర్తుకు తెచ్చుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు పరికరాలు పంపిణీ

మడకశిర : పారిశుధ్య కార్మికులకు మండలంలోని కల్లుమరి సర్పంచి గంగమ్మ నాగరాజు పరికరాలను బుధవారం పంపిణీ చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు కాలి బూట్లు ,రేడియం స్టిక్కర్స్ అతికించిన ప్రమాద రహిత దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. వీటితోపాటు పారిశుధ్య పనిముట్లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మదరసా రబ్బానియా వార్షికోత్సవం

కదిరి టౌన్ : కదిరి పట్టణం కాలేజీ రోడ్డు, జెండామాను వీధి మదరస రబ్బానియా వార్షికోత్సవాన్ని మదరస కార్యదర్శి హాజీ అత్తార్ మహబూబ్ బాషా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ సభకు మౌలానా అబ్దుల్ రెహమాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మదరస అధ్యక్షులు హాజీ జాఫర్ సాదిఖ్, కోశాధికారి అజీం ఖాన్, ఉప కార్యదర్శి అన్వర్, కార్య నిర్వాహక సభ్యులు నిజాముద్దీన్, 31వ వార్డు కౌన్సిలర్ (బీబిజాన్, ఉస్తాద్ హాఫీజ్ అహ్మద్ హుస్సేన్, హాఫీజా షాఫియా, మౌలిమా షాఫియా తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో శ్రమదానం

హిందూపురం : పట్టణంలోని సడ్లపల్లి శ్మశానవాటికలో వార్డు కౌన్సిలర్ సునీత వెంకటేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్మశానంలో పెరిగిన కంపచెట్లను తొలగించి శుభ్రం చేశారు.

15 రోజులుగా తాగునీటికి ఇక్కట్లు

చిలమత్తూరు : మండలంలోని మొరసల పల్లి పంచాయతీ పరిధిలోని దోర్నాల పల్లి గ్రామంలోనీ బిసి కాలనీ వాసులకు 15 రోజులుగా తాగునీరు అందడం లేదు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవటం లేదని విమర్శించారు. పైప్‌లైన్ ఏర్పాటు లో లోపం వల్లే తమకు నీటి సమస్య ఏర్పడిందని వాపోయారు. ఇప్పటికైన మండలస్థాయి అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యపై సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

నాయకుల్లో జోష్ నింపుతున్న యువగళం పాదయాత్ర

కదిరి అర్బన్ : రెండు రోజులుగా కదిరి నియోజకవర్గంలో కొనసాగుతున్న యువగళం పాదయాత్రలో యువత జోష్ పెరుగుతోంది.పాదయాత్రలో యువకులు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి నడిచారు. ఈ పాదయాత్రతో రహదారులన్నీ పసుపుమయంగా మారాయి. యువగలం పాదయాత్ర 47వ రోజు ఆదివారం కదిరి నియోజకవర్గంలో బస చేసిన ప్రదేశం నుంచి ప్రారంభమై నల్లచెరువు మండల పరిధిలోకి అడుగుపెట్టింది. దీంతో ఆ ప్రాంత టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ స్థాయిలో స్వాగతం పలికారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాతో పాటు టిడిపి నాయకులు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.

మడకశిర : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఆదివారం సత్యసాయి జిల్లాలో సాగుతున్న యాత్రలో గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈయన వెంట రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి , న్యాయవాది గోవిందప్ప, బెంగళూరు టిడిపి ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ రామ్ గోపాల్ రెడ్డి విజయానికి కారణమైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు టిడిపి కొండకమర్ల గ్రామ నాయకులు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేసిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ఎంపి జాకీర్ అహమ్మద్, ఎస్సీ సెల్ కార్యదర్శి బడిసం రామాంజనేయులు, తెలుగు యువత మండల అధ్యక్షులు కొండే ఈశ్వరయ్య, నియోజకవర్గ మైనార్టీ జనరల్ సెక్రెటరీ ఇర్షాద్, పార్లమెంటరీ తెలుగు యువతకార్యదర్శి జయ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర బహిరంగసభకు హాజరైన జనం

కదిరి అర్బన్ : నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన యువగళం పాదయాత్ర జోరుగా ఉషారుగా కొనసాగుతోంది కదిరి నియోజకవర్గం పరిధిలోని నల్లచెరువు మండలంలో చేపడుతున్న పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్‌తో పాటు పుట్టపర్తి నియోజకవర్గంలోని వడ్డెర సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు లోకేష్‌ను గజమాలతో సత్కరించారు. లోకేష్ తో పాటు నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు పాదయాత్రకి మద్దతుగా నిలిచారు.

వైసీపీ పతనం ప్రారంభం : టిడిపి

కొత్తచెరువు : రాష్ట్రంలో వైసిపి పతనం ప్రారంభమైందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ గెలుపుతోనే వైసీపీ ప్రభుత్వానికి పతనం మొదలైందని అన్నారు. ఈ నెల 21వ తేదీ పుట్టపర్తి నియోజకవర్గంలోకి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు సాకల సుబ్బరాయుడు, బోయ రాజు, పెద్దన్న, సురేష్ బాలాజీ పాల్గొన్నారు.

అమరాపురం : టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి విజయం వైసిపి ప్రభుత్వం పతనానికి తొలి అడుగు అని టిడిపి నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని మాజీ జెడ్పిటిసి రత్నం నరసింహామూర్తి ఇంటి ఆవరణంలో మండల కన్వీనర్ గణేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు ఎమ్మెల్సీ స్థానాల విజయానికి కారణమైన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు.

యువగళం పాదయాత్ర షెడ్యూల్

కదిరి టౌన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 48వ రోజు షెడ్యూల్‌ను ఆపార్టీ నాయకులు విడుదల చేశారు. నల్లచెరువు మండలం జోగన్నపేట విడిది కేంద్రం నుంచి సోమవారం ఉదయం 8 పాదయాత్ర ప్రారంభం అవుతుంది.

8 :45 గంటలకు మోటుకుపల్లి వద్ద అనాథలతో మాటామంతీ.

10 :20 మోటుకుపల్లి పివిఆర్ గ్రౌండ్ లో బిసి సామాజికవర్గీయులతో ముఖాముఖి.

11 : 20 మోటుకుపల్లిలో భోజన విరామం.

2 : 20 మోటుకుపల్లి భోజన విరామస్థలంలో ముస్లింలతో ముఖాముఖి.

4 :20 గంటలకు కదిరి పట్టణం ఇక్బాల్ సర్కిల్ (జీవమాను సర్కల్) లో స్థానికులతో మాటామంతీ.

4 : 45కుకదిరి ఎంజి రోడ్డులో జ్యూయలరీ షాపు యజమానులతో భేటీ.

5 :00గంటలకుకదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం దర్శనం, ఆలయంలో ప్రత్యేక పూజలు.

5:45 కోనేరు సర్కిల్ వద్ద స్థానికులతో ముఖాముఖి.

7 : 10 కు కదిరి ఆర్డీవో కార్యాలయం వద్ద విడిది కేంద్రంలో బస.

పాదయాత్రను విజయవంతం చేయండి

హిందూపురం : సత్యసాయి జిల్లాలో జరుగుతున్న యువనేత లోకేష్ పాదయాత్రలో నియోజక వర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలుయ పాల్గొని విజయవంతం చేయాలని పరిశీలకులు నరసింహులు యాదవ్ కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద పాదయాత్రపై నాయకులు, కార్యకర్తలతో పట్టన అధ్యక్షులు రమేష్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పరిశీలకులు నరసింహులు యాదవ్, నియోజకవర్గం సమన్వయకర్త శ్రీనివాసరావు, డాక్టర్ సురేంద్ర హాజరయ్యారు. కీలకమైన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు ద్వారా పార్టీకి గొప్ప విజయం అందించారన్నారు. యువగళం పాదయాత్ర సత్యసాయి జిల్లాలో జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం హిందూపురం నుండి పెద్ద ఎత్తున తరలివెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, అనీల్‌కుమార్, అశ్వర్థరెడ్డి, జయప్ప, రంగారెడ్డి, రాష్ట్ర నాయకులు ఆనంద్ కుమార్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

రొద్దం : టింబక్టివ్ కలెక్టివ్, చిగురు, కల్పవల్లి ఆధ్వర్యంలో మండలంలోని కల్పవల్లి అటవీ సంరక్షణ ప్రాంతంలో ఆదివారం ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అటవీ సంరక్షణ, చెట్లు నాటడం,చెట్లు కాపాడుకోవడం చాలా ముఖ్యమని మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. పిల్లలకు బాల్య దశలో పకృతి పర్యావరణ విషయాలపై అవగాహన కల్పించాలని రమేష్ అన్నారు. బాలల సంఘాల పిల్లలు తయారుచేసిన ఆహారం గొలుసు, వాటర్ షెడ్, వాతావరణం మార్పు, అడవుల సంరక్షణ, జీవన వైవిధ్యం, విత్తనాలు, సహన గడ్డి భూములు, అడవులకు నిప్పు పెడితే కలిగే అనార్థాలు వంటి నమూనాలు ఆకట్టుకున్నాయి. నమూనాలను ప్రదర్శించిన వారిని బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ప్రాచీన కళ అయిన చెక్కల భజన ప్రదర్శన చేసినట్లు చిగురు కోఆర్డినేటర్ రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్పవల్లి సిఇఒ చిరంజీవి, రామాంజి, అధ్యక్షులు నాగరాజు, చిగురు, కల్పవల్లి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

ధర్మవరం టౌన్ : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి సూచించారు. స్థానిక నాగార్జున ఆంగ్లమాధ్యమ పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డోలా పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాలాంజనేయులు, సురేశ్, ఎర్రిస్వామి, నాగార్జునస్కూల్ కరస్పాండెంట్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

'పల్లె' సారథ్యంలో పాదయాత్రకు జన సమీకరణ

పుట్టపర్తి అర్బన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ఈనెల 21న పుట్టపర్తి నియోజకవర్గం లోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సారథ్యంలో భారీ జన సమీకరణకు సన్నాహాలు సాగుతున్నాయి. నియోజకవర్గంలో ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు పార్టీ అభిమానులు లోకేష్‌కు స్వాగతం పలకడానికి తగిన కసరత్తులు చేస్తున్నారు. ముఖ్యంగా పల్లె సమీకరణ బాధ్యతలను నాయకులకు అప్పగించడమే గాక, తాను కూడా స్వయంగా మండలాల్లో పర్యటిస్తున్నారు. వేలాది మందితో స్వాగతం పలకడానికి తగిన సన్నాహాలు చేపట్టారు. ప్రతి కార్యకర్త నాయకులు ఈ పాదయాత్రను విజయవంతం చేయడానికి సిద్ధం చేస్తున్నారు. ఆయా మండలాల నాయకులు కూడా జన సమీకరణకు కృషి చేస్తున్నారు.

అన్ని వర్గాలనూ మోసం చేసిన వైసిపి : జనసేన

ధర్మవరం టౌన్ : ఉరూరా తిరుగుతూ అమలుకానీ హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక జగన్మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలను నిండా మోసం చేశారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నంలో తమ పార్టీ ఆవిర్భావదినోత్సవం విజయవంతమైతే వైసీపీ మంత్రులు తమ అధినేతపై నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఇది తగదని అన్నారు. తమ అధినేత లక్ష్యం వైసీపీని గద్దెను దించడమేనన్నారు. ఇప్పటికే మార్పు వచ్చిందని, అందుకు ఉదాహరణ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ఫలితాలేనని అన్నారు.



మాట్లాడుతున్న 'చిలకం'

IN THA COURT OF THE ADDL JUNIOR CIVIL JUDGE, HINDUPURAM
I.A.NO:237/22 in O.S.NO:220/2011.
Between:
K.Sreeramappa ...Petitioner/Plaintiff
V/S
Narayanappa (Died) and others
...Recepondents/ proposed/ Defendants
Notice to Recepondents 13 to 18
R13: Anjinamma D/o Late Narayanappa Aged 50 Years,
R14: Sivamma D/o Late Narayanappa Aged 48 Years,
R15: Lakshmi Devi D/o Late Narayanappa Aged 46 Years,
R16: Rangamma D/o Late Narayanappa Aged 44 Years,
R17: Lakshmanna S/o Late Narayanappa Aged 42 Years,
R18: Venkataramudu S/o Late Narayanappa Aged 40 Years,
all are R/o Bandlapalli (V) H/o Nesevandla palli (V) Chilamathur (M) Ananthapuramu (Dist) Now Sri Satyasai (Dist)
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా 1వ ప్రతివాది నారాయణప్ప చనిపోయినాడు. కనుక అతని వారసులుగా మిమ్ములను దావాలో చేర్చుటకు గాను పై పిటిషన్ వేయడం జరిగినది.కనుక పై దావాను 24/03/2023 వ తేదిన మీరు ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపవచ్చును. అట్లు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది: 24/03/2023
ఎ.నాగరాజు, బి.ఎ., ఎల్.ఎల్.బి., వాదిపరం న్యాయవాది, హిందూపురం.

రాష్ట్ర స్థాయి బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని గ్లోబల్ జెన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆంధ్ర చెస్ అసోసియేషన్ సౌజన్యంతో శ్రీసత్య సాయి జిల్లా అండర్- 19 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్-2023 జట్టు ఎంపిక పోటీలను నిర్వహించినట్లు జిల్లా చెస్ అడ్-హక్ కమిటీ కన్వీనర్ నాగార్జున కర్ణాటకమ్ తెలిపారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ చైర్మన్ శ్రీనివాసులు,కన్వీనర్ సాయి శ్రీధర్, టోర్నమెంట్ డైరెక్టర్ శ్రవణ్ కుమార్, టోర్నమెంట్ కోఆర్డినేటర్లు చిన్న రాయుడు, హరీష్, చెస్ కోచ్ క్రాంతి, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ ఉదయ్ కుమార్ నాయుడు తదితరులు క్రీడాకారులను ఎన్నుకున్నారు. జిల్లాస్థాయి పోటీల్లో రెండు విభాగాల్లోనూ నలుగురు క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అండర్- 19 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో శ్రీసత్య సాయి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అండర్- 19 ఓపెన్ విభాగం 1వ స్థానంలో నిఖిలేంద్ర, 2వ స్థానం వేణు తేజ,3వ స్థానం నిశ్చిత్ సందేశ్, 4వ స్థానం జైకృష్ణ ,అండర్- 19 బాలికల విభాగంలో 1వ స్థానంలో జ్ఞాపికా రెడ్డి, 2వ స్థానంలో పూర్ణమ్మ, 3వ స్థానం హరిణి సాయి,4వ స్థానం మధు శ్రీ నిలిచారని టోర్నమెంట్ చైర్మన్ శ్రీనివాసులు,జిల్లా చెస్ అడ్-హక్ కమిటీ కన్వీనర్ నాగార్జున కర్ణాటకమ్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న జిల్లా వైద్యాధికారి కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల వైద్యాధికారులకు ధర్నాకు సంబందించిన నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతు ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులను చేయిస్తున్నారన్నారు. రాజకీయ, అధికారుల వేదింపులు ఎక్కువ అయ్యాయన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. అర్హులను ఎఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు జ్యోతమ్మ, ప్రశాంతమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి వినతి ఇస్తున్న దృశ్యం